

ముఖమండపంలో పట్నంవేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

మల్లన్న ఆలయం.. భక్తిపారవశ్యం

- స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

చేర్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కొమరవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఈసందర్భంగా భక్తులు మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు సమర్పించుకున్నారు. గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. ఎల్లమ్మకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగుచెట్టు ఆలయ ప్రాంగణాలు జనాలతో సందడిగా మారాయి. ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్వామివారిని దర్శించు కుని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు

మెదక్ చర్చిలో ఘనంగా ఈస్టర్

మెదక్, కల్చర్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఉదయం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఇన్‌చార్జి బిషప్ రూబెన్‌మార్క్, ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులతో కలిసి మత గురువులు ప్రత్యేక గీతాలను ఆలపించారు. ప్రార్థనల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మత గురువులు రిచర్డ్ జైపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి హైటెన్షన్

సోషల్‌మీడియాలో ర్యాలీపై ఓ యువకుడి అనుచిత వ్యాఖ్యలు

అతడి ఇంటివద్ద ధర్నా చేసేందుకు హిందూవాహిని కార్యకర్తల యత్నం

అడ్డుకున్న పోలీసులు

మిరుదొడ్డిలో పికెటింగ్ 7

వెల్‌నెస్ సెంటర్‌లో గడువు తీరిన ట్యాబ్లెట్లు

జ్వరం, దగ్గుతో వెళ్లిన మహిళకు ఇచ్చిన ఫార్మసిస్ట్

నిర్లక్ష్యంగా విధులు, ప్రాణాలతో చెలగాటం

సంగారెడ్డి వెల్‌నెస్ సెంటర్‌లో ఘటన 7



మహిళకు అందజేసిన రెండు నెలల క్రితం గడువు తీరిన మాత్ర





స్వరాష్ట్ర ఉద్యమానికి జైకొడుతూ తెలంగాణ రాష్ట్ర సమితిగా ఆవిర్భవించిన నాటి టీఆర్‌ఎస్.. ఇప్పటి బీఆర్‌ఎస్‌కు ఉమ్మడి మెదక్ జిల్లా పురిటిగడ్డ. 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ ఆలోచనతో సిద్దిపేటలో పురుడుపోసుకున్న గులాబీ పార్టీ పాతికేళ్ల సంబరానికి సమయం ఆసన్నమైంది. రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో జనాన్ని సమీకరించి మెతుకుసీమ సత్తా చాటాలని ఆ పార్టీ శ్రేణులంతా పది రోజులుగా శ్రమిస్తున్నాయి.



గులాబీ జాతరకు సమాయత్తం

రజతోత్సవ వేడుకపై బీఆర్‌ఎస్ శ్రేణుల దృష్టి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనసమీకరణపై ఫోకస్

సన్నాహక సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు బిజీ

సమీక్షలతో కసరత్తు చేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట నుంచి ఎల్కతుర్తికి భారీ పాదయాత్ర

పార్టీ, స్వరాష్ట్ర ఉద్యమానికి మెతుకుసీమనే పురిటిగడ్డ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 20 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న తలపెట్టిన బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకపై ఆ పార్టీ శ్రేణులు దృష్టిసారించారు. మొన్న అసెంబ్లీ, నిన్న పార్లమెంటు ఎన్నికల్లో దారుణ ఓటమి తర్వాత జరుగుతున్న తొలి సభ ఇది. అంతేగాకుండా పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భం. పార్టీకి పురిటిగడ్డగా ఉన్న మెతుకుసీమలో రెండు దశాబ్దాల పాటు తిరుగులేని ఆధిక్యం ప్రదర్శించిన గులాబీ దండుకు గడిచిన ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలింది. మరికొద్ది రోజుల్లోనే స్థానిక, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్న తరుణంలో ఈ వేడుకను అందిపుచ్చుకోవాలని, పునర్వైభవానికి బాటలు వేసుకోవాలని బీఆర్‌ఎస్ నేతలంతా సన్నద్ధమవుతున్నారు.

జనసమీకరణకు కసరత్తు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి లక్ష మందిని తరలించాలని బీఆర్‌ఎస్ నేతలు అంచనా వేస్తున్నారు. కానీ ఎండలు మండుతుండడంతో ఆ సంఖ్య సాధ్యమవుతుందా.. లేదా అని తర్జనభర్జన పడుతున్నారు. ఇక సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోనే భాగమైన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ప్రస్తుతం సభ జరుగుతోంది. దీంతో హుస్నాబాద్ నియోజకవర్గం నుంచే 50వేల జనాభాను సమీకరించాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి 30వేల మందిని తరలించేలా హరీశ్‌రావు వాహనాలను సమకూర్చుకున్నారు. ఇక గజ్వేల్, నర్సాపూర్, మెదక్, సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, దుబ్బాక నియోజకవర్గాల నుంచీ 10వేల చొప్పున

మిగతా 7వ పేజీలో

సమీక్షిస్తున్న హరీశ్‌రావు

రజతోత్సవ సభ కోసం మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి సారించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో సమావేశమైన అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో నిత్యం సమీక్షిస్తున్నారు. సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల సమావేశాల్లో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పటాన్‌చెరులో ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర అనంతరం జరిగిన సమావేశంలోనూ జనసమీకరణ గురించి హరీశ్ కార్యకర్తలతో చర్చించారు. మిగతా నియోజకవర్గాల్లోనూ ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. వాహనాలు, భోజన ఏర్పాట్లు, ఇతరాత్ర విభాగాలకు ప్రత్యేక కమిటీలను నియమించారు. ఈ కమిటీలకే బాధ్యతలు అప్పగించారు.





కొమురవెల్లి క్షేత్రంలో నిర్మించనున్న 100 గదుల సత్రం ప్రతిపాదిత స్థలం, భవన సముదాయ ప్లాన్

సత్రం.. సత్వరమే

మల్లన్న క్షేత్రంలో 100 గదుల భవన నిర్మాణానికి అడుగులు.. మొదటి గదికి భక్తుడి విరాళం

చేర్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ పరిధిలో డోనార్ స్కీం ద్వారా చేపట్టనున్న 100 గదుల సత్ర భవన నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. దాతల నుంచి విరాళాల సేకరణ ఆహ్వానిస్తూ ఇటీవల నోటిఫై చేయడంతో పలువురు భక్తులు ముందుకు వస్తున్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన కె.వినోద్‌కుమార్ తన తండ్రి సంకల్పం మేరకు తొలి గది నిర్మాణానికి ఆదివారం రూ.15 లక్షల చెక్కును ఈవో అన్నపూర్ణకు అందజేశారు. 100 గదుల సత్రం నిర్మాణానికి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆలయ పరిధిలో 15 గుంటల స్థలాన్ని కేటాయించారు. ఒక్కో అంతస్తులో 20 గదుల చొప్పున ఐదు అంతస్తుల భవన సముదాయానికి రూ.17 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. మొదటి అంతస్తులో 20 గదుల నిర్మాణానికి రూ.5 కోట్ల మేర దేవాదాయశాఖ నిధులతో పనులు ప్రారంభించి మిగతా నాలుగు అంతస్తులలో 80 గదులను దాతల ద్వారా నిర్మించాలని నిర్ణయించారు. ఒక్కోగదికి రూ.15 లక్షల చొప్పున విరాళాల ద్వారా సేకరిస్తున్నారు. గదిలో హాల్, బెడ్‌రూం, రెండు బాత్‌రూంలు, కిచెన్ ప్యాంట్రీ ఉండేలా డిజైనింగ్ చేశారు. అన్నీ కలిసివస్తే సుమారు ఏడాదిన్నరలో భవనం అందుబాటులోకి రానుంది.

త్వరితగతిన నిర్మిస్తాం



భక్తుల వసతి కల్పనకు డోనార్ స్కీం ద్వారా 100 గదుల భవన సముదాయాన్ని త్వరితగతిన నిర్మిస్తాం. రూ.17 కోట్ల వ్యయం కానుండటంతో దేవాదాయశాఖ కమిషనర్ సూచనానుసారం విరాళాల సేకరణ చేపట్టాం. దేవాలయ నిధులు రూ.5 కోట్లతో మొదటి అంతస్తులో 20 గదుల నిర్మాణం చేపడుతాం. గతంలో మాదిరి కాకుండా ఒకే దఫాలో విరాళం ఇచ్చే వారి నుంచే సేకరిస్తున్నాం.

- అన్నపూర్ణ, ఈవో

కడుపు కోత



తగ్గిన సాధారణ ప్రసవాలు

సిజేరియన్‌ల వైపే మొగ్గు

జిల్లాలో 240కిపైగా ప్రైవేట్ ఆసుపత్రులు

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఇదే తంతు

ఇటీవలే సీ సెక్షన్‌ల కట్టడిపై

వైద్యాధికారుల సమీక్ష

జిల్లాలో డెలవరీల వివరాలు

సంవత్సరం	సాధారణ	సీ సెక్షన్	మొత్తం
2022	2,377	3,096	5,483
2023	2,316	2,740	5,056
2024	2,096	2,234	4,330



జీజీహెచ్ ప్రసూతీ వార్డులో మహిళలు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 20 : మొన్నటివరకు ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, ప్రైవేటులోనూ సాధారణ ప్రసవాలను చేసేందుకే ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చారు. కొన్ని నెలలుగా మాత్రం ఎడాపెడా సిజేరియన్‌లు (సీ సెక్షన్) ఆపరేషన్లు జరుగుతున్నాయి. వైద్య అధికారులు ఎట్టకేలకు సిజేరియన్‌లను తగ్గించేందుకు దృష్టిసారించారు. ఇక నుంచైనా కోతలు లేకుండా సాధారణ ప్రసవాలపై నిఘా పెంచనున్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు పెరిగిన తాకిడి

జిల్లాలో సాధారణ ప్రసవాలు తగ్గుముఖం పట్టి అసాధారణాలు ఎక్కువవుతున్నాయి. జిల్లాలో 240 ప్రైవేట్ ఆసుపత్రులుండగా, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులున్నాయి. కేసీఆర్ కిట్టు పథకంలో భాగంగా మగపిల్లలు పుడితే రూ.12వేలు, ఆడపిల్ల పుడితే రూ.13వేలు గతంలో అందించగా, ఎక్కువగా మహిళలు ప్రభుత్వ ఆసుపత్రులకే వచ్చేవారు. కిట్టుకు తాత్కాలికంగా బ్రేక్ వేయడంతో తిరిగి ప్రైవేట్ ఆసుపతుల వైపు మహిళలు మొగ్గుచూపుతున్నారు.

పెరిగిన సిజేరియన్లు

వైద్యులు గర్భిణులకు సాధారణ ప్రసూతీ సేవలను అందించి, తల్లీబిడ్డల సంరక్షణకు పాటు పడాల్సింది పోయి జిల్లాలో వేల సంఖ్యలో సిజేరియన్‌లు చేస్తున్నారు. నెలలు నిండిన గర్భిణులు పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవల కోసం వెళితే వైద్యులు ధనార్జనే ధ్యేయంగా అవసరం ఉన్నా, లేకున్నా శస్త్రచికిత్స చేయాలని లేదంటే తల్లీబిడ్డలకు ప్రమాదమని భయపెడుతూ కడుపు కోతలు చేస్తున్నారు. రూ.40 నుంచి రూ.50 వేల వరకు సీ సెక్షన్ పేరిట దండుకుంటున్నారు. సాధారణ ప్రసవాలకు నొప్పులు వచ్చి డెలవరీ అవ్వడానికి సమయం పడుతుండగా, పలువురు వైద్యులు అంత సమయం వేచి ఉండలేక కోతలకే మొగ్గుచూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇదే తంతు కొనసాగుతున్నా వైద్య శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. గతేడాది నుంచి ఏప్రిల్ వరకు జరిగిన ప్రసవాల్లో 40 శాతం లోపు సాధారణ ప్రసవాలుండగా, 60 శాతంపైగా సీ సెక్షన్‌లు నమోదవ్వడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సాధారణ ప్రసవాలు తగ్గిపోయాయి. గతానికి భిన్నంగా ప్రభుత్వ ఆసుపత్రులూ ప్రస్తుతం సీ సెక్షన్‌లో ముందుంటున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నాయి.

ముహూర్తాలు, మంచి రోజులు చూసి

నెలలు నిండిన కొందరు గర్భిణుల బంధువులు శస్త్రచికిత్స ద్వారానే డెలవరీ కావాలని చూస్తున్నారు. అందుకు గర్భిణులు నొప్పులు భరించలేకపోవడం ఓ కారణమైతే, ముహూర్తాలు, మంచి రోజుంటూ ముందుగానే తేదీని, సమయాన్ని చూసుకుని సిజేరియన్‌లను చేయిస్తున్నారు. స్కానింగ్ తీసిన తరువాత వైద్యులు అందించే తేదీని బట్టి, ముందు రోజే లేక మరుసటి రోజు పురోహితుడి వద్దకు వెళ్లి మరీ ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారు. దానికి తోడూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పలువురు సాధారణ ప్రసూతికి అనుకూలంగా ఉంటే కూడా శస్త్రచికిత్స చేయాలని, నొప్పులు భరించడం లేదని స్థానిక నాయకుల ద్వారా వైద్యులకు ఫోన్ చేయిస్తున్నారు. దీంతో చేసేదేమీలేక వైద్యులు శస్త్రచికిత్సలను నిర్వహిస్తున్నారు.



సీ సెక్షన్‌ల కట్టడిపై సమీక్ష నిర్వహిస్తున్న వైద్య శాఖ అధికారులు(ఫైల్)

సీ సెక్షన్‌ల కట్టడిపై అధికారుల సమీక్ష

జిల్లాలో జరుగుతున్న సీ సెక్షన్‌లకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ఇటీవల సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు మొదటి కాన్పుకై వైద్య సేవలపొందేందుకు వస్తున్న వారికి నెలలు నిండిన తరువాత సాధారణ ప్రసవం కోసం వేచిచూడాలని గర్భిణులు, వారి బంధువులకు అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. అంతేగాని అవసరం లేకున్నా సీ సెక్షన్‌లు నిర్వహించినా, నిబంధనలు అతిక్రమించి సిజేరియన్లు చేసినా ఆసుపత్రుల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు.





స్విమ్మింగ్ జాయ్

ఎండ సెగలను తప్పించుకోవడానికి చిన్నాపెద్ద హాయిగా స్విమ్మింగ్ చేసేస్తున్నారు. సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ స్విమ్మింగ్ పూల్ ఆదివారం సందడిగా మారింది. యువకులతో పాటు పెద్దలు తమ పిల్లలను తీసుకొచ్చి సరదాగా ఈత కొట్టారు. కొందరు తల్లులు తమ పిల్లలకు దగ్గరుండి మరీ స్విమ్మింగ్‌లో మెలకువలు నేర్పించారు.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి)





రాజస్థాన్ కూలీలకు తప్పిన భారీ ప్రమాదం

● బ్రిడ్జి సైడ్‌వాల్ ఢీకొని ఊడిన ప్రైవేటు బస్సు చక్రాలు ● హల్దీవాగు బ్రిడ్జి అంచుపై నిలిచిన ట్రావెల్స్ బస్సు

తూప్రాన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు కూలీలను తరలిస్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు భారీ ప్రమాదం తప్పింది. బ్రిడ్జి సైడ్‌వాల్‌కు ఢీకొట్టగా రెప్పపాటులో ప్రమాదం నిలిచిపోయింది. అందులో ప్రయాణిస్తున్న కూలీలు ఊపిరి బిగబట్టి బయటపడ్డారు. అందులో ప్రయాణిస్తున్న 20 మంది కూలీలు ప్రాణాలతో బయటపడగా, స్వల్పగాయాలకు గురయ్యారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన కూలీలు హైదరాబాద్‌లో పనులు చేసేందుకు వస్తుంటారు. ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు (ఎంపీ 13జెడ్‌జీ 8454)లో 20 మంది కూలీలు హైదరాబాద్‌కు బయలుదేరారు. తూప్రాన్ పట్టణ శివారులో 44వ జాతీయ రహదారి హల్దీ వాగు బ్రిడ్జిపైకి రాగానే సైడ్‌వాల్‌ను ఢీకొట్టింది.



హల్దీవాగు బ్రిడ్జి సైడ్‌వాల్‌పై నిలిచిన బస్సు, క్రేన్ సహాయంతో ఊడిన చక్రాలు తీస్తున్న దృశ్యం

సుమారు 20 అడుగుల మేర బ్రిడ్జి సైడ్‌వాల్ దెబ్బతినగా, బస్సు సైడ్‌వాల్ మధ్యలో నిలిచిపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న కూలీలకు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బస్సు బ్రిడ్జి వైపు ఒరిగినా భారీ ప్రమాదం జరిగేది. ప్రమాదం నుంచి బయటపడిన కూలీలను మరో బస్సులో హైదరాబాద్‌కు తరలించారు. తూప్రాన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

'రాజీవ్ యువ వికాసం గడువును పెంచాలి'

నారాయణఖేడ్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల గడువును కనీసం 24 వరకు పెంచాలని సామాజిక కార్యకర్త మున్వర్ ఖురేషి కోరారు. వరుసగా హనుమాన్ జయంతి, రెండో శనివారం, ఆదివారం, అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవులు రావడంతో సర్టిఫికెట్లు రాక అనేకమంది దరఖాస్తులు చేసుకోలేకపోయారన్నారు. అందువల్ల దరఖాస్తుల గడువును పొడిగించాలని కోరారు.

బైక్ ఢీకొని ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు


దశరథ(ఫైల్)

హత్నూర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవులపల్లి గ్రామ శివారులో హత్నూర-దౌల్తాబాద్ రోడ్డుపై శనివారం రాత్రి జరిగింది. మాదుర గ్రామానికి చెందిన లింగన్నగారి దశరథ రోజు మాదిరిగానే శనివారం ఉదయం దౌల్తాబాద్ వచ్చి రాత్రి స్వగ్రామానికి తన బైక్‌పై వెళ్తున్నాడు. దేవులపల్లి గ్రామ శివారులోకి చేరుకోగానే హత్నూర వైపు నుంచి ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దశరథ తలకు తీవ్రగాయాలు కాగా, అతని బైక్‌పై ఉన్న మహిళ, ఎదురుగా వచ్చిన బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. కాగా ముగ్గురిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ దశరథను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య వీరమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మెదక్ అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పిలికొట్టాల శివారులోని పిల్లికుంట(చిన్న చెరువు)లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసు వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(40) కుంటలో మృతిచెంది ఉన్నాడని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పరిసరాలను పరిశీలించారు. మృతుడి శరీరంపై కుడిచేతి మట్టపై త్రిశూలం ట్యాటూ ఉంది. మెడలో పూసల గొలుసు ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీసులకు 8712657913 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

పశువుల అక్రమ తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

కొండపాక, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా పశువులను తరలిస్తుండగా దుద్దెడకు చెందిన పలువురు అడ్డగించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిద్దిపేట నుంచి కొండపాక వైపు బొలెరోలో తొమ్మిది ఆవులు, ఒక లేగను తరలిస్తున్నారు. దీనిని మురళీ అనే వ్యక్తి గమనించి హిందూవాహిని సభ్యులకు సమాచారం ఇవ్వగా.. వారు పోలీసులకు తెలిపారు. త్రీ టౌన్ పోలీసులు దుద్దెడ టోల్ గేట్ వద్ద వాహనాన్ని అడ్డగించి విచారించారు. నల్లగొండ సంత నుంచి హైదరాబాద్ మూసాపేటకు తరలిస్తున్నట్లు డ్రైవర్ తెలిపాడు. అనుమతులు లేకుండా తరలిస్తున్నారని తేలడంతో పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పశువులను తరలిస్తున్న వ్యాన్

ప్రతిష్ఠాపనోత్సవాలకు రామాలయం ముస్తాబు

● నేటి నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు
● ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు


పెద్దశంకరంపేటలో ముస్తాబైన రామాలయం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : సీతారామచంద్రస్వామి పునః ప్రతిష్ఠోత్సవాలకు మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలోని రామాలయం సుందరంగా ముస్తాబైంది. నేటి నుంచి 23 వరకు ఉత్సవాలు నిర్వహించినట్లు ఆలయ అధ్యక్షుడు గుజ్జరి స్వప్నకనకరాజు తెలిపారు. 21 ఉదయం వేద స్వస్తి ధ్వజారోహణం, గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ, మాత్రు కారాధనము తదితర పూజలు, 22న ఉదయం గురు వందనం, మంటప ఆవాహిక దేవతాపూజలు, జపాలు, ధాన్యాదివాసం, లక్ష పుష్పార్చన, 23న యంత్ర, మూర్తి, ధ్వజ, ప్రాణ ప్రతిష్ఠలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి హాజరుకానున్నారు. భక్తులందరూ అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

జాతరకు ఎల్లమ్మ ఆలయం ముస్తాబు


ఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్ ఆలయంలో వెలసిన ఎల్లమ్మతల్లి

నారాయణఖేడ్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్‌లో వెలసిన ఎల్లమ్మ ఆలయ జాతర ఈ నెల 23 నుంచి ప్రారంభంకానున్నది. ఇందుకు ఆలయాన్ని నిర్వాహకులు ముస్తాబు చేశారు. ఈ జాతరకు సంగారెడ్డి జిల్లా నలుమూలల వారే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. 23న బోనాల ఊరేగింపు, 24న బండ్ల ప్రదర్శన, 25న పాచి బండ్ల ప్రదర్శన, నిండు జాతర, 26న కుస్తీ పోటీలు, 27న చివరి పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా ర్యాకల ఎల్లమ్మ జాతరను పురస్కరించుకొని భక్తుడు చారి సొంత ఖర్చులతో 35 బండ్లను ఆలయం చుట్టూ తిప్పనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి అఖండ హరినామ సప్తాహ

నారాయణఖేడ్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని భూమయ్య కాలనీలో గల శివ పంచాయతన అభయాంజనేయ స్వామి ఆలయంలో 21 నుంచి 28 వరకు అఖండ హరినామ సప్తాహ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వామన్‌రావుమహరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కోశాధికారి సాయిబాబు

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఆర్థిక విధానాలు

- లేబర్‌కోడ్ అమలుతో కార్మికుల హక్కులకు విఘాతం
- సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు

పటాన్‌చెరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక విధానాల రూపకల్పనకు తెరవెనక ప్రయత్నాలు చేస్తోందని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు అన్నారు. తోషిబా పరిశ్రమల సీఐటీయూ కార్మిక సంఘం ఏర్పాటు చేసి 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్మిక హక్కులు, లేబర్‌కోడ్‌లపై పటాన్‌చెరు శ్రామిక భవన్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లేబర్‌కోడ్‌లను అమలుతో 99శాతం పరిశ్రమలకు కార్మిక చట్టాలు వర్తించవన్నారు. లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న చేపడుతున్న జతీయ సమ్మెను జయప్రదం చేయాలన్నారు. తోషిబా పరిశ్రమ యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూ 25ఏళ్లలో తోషిబా కార్మికులు కలిసికట్టుగా సీఐటీయూ నేతృత్వంలో అనేక విజయాలు సాధించామన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.మల్లేష్, కోశాధికారి రాజయ్య, ఉపాధ్యక్షుడు పాండు రంగారెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి అనంతరావు, నాయకులు శ్రీధర్, వెంకటేశ్వరావు, పుల్లంరాజు, శ్రీనివాస్‌నాయుడు, నరేందర్, ప్రకాష్, సురేష్, మైపాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు

- ఎంపీ సురేష్ షెట్కార్



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కంగ్టి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తున్నదని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తడ్కల్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం జొన్నలకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3371 చెల్లిస్తుందన్నారు. జొన్నలు పండించిన రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కేంద్రంలో అమ్ముకొని లబ్ధి పొందాలని సూచించారు. రైతులతో పాటు కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతిరెడ్డి, ఏవో హరీష్ పవార్, మండల పార్టీ అధ్యక్షులు మల్‌రెడ్డి, పరశురాం, మనోహర్, మాణిక్‌పటేల్, నాగన్న, ఉపేందర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, జ్ఞానేశ్వర్, బ్రహ్మానందారెడ్డి, దావిద్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయలకు భక్తుల తాకిడి



అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ

పాపన్నపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వన దుర్గ మాత దర్శనం కోసం జనం బారులు తీరారు. భక్తులందరూ ముందుగా మంజీరా నదిలో పుణ్య స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ పూజారులు హారతి, ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సిబ్బంది భక్తులకు సౌకర్యాల కల్పనలో తలమునకలయ్యారు.

తాగునీటి కటకట

కంది మండలంలో నీటి కష్టాలు

- మిషన్ భగీరథ పైపులైన్లకు మరమ్మతులు
- పనిచేయని పంచాయతీ బోర్లు
- రెండు నెలలుగా ట్యాంకర్లే దిక్కు
- అరకొర నీటితో తప్పని అవస్థలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



కొయ్యగుండుతండాలో డ్రమ్ముల్లో ట్యాంకర్ నీరు నింపుతున్న పంచాయతీ సిబ్బంది

కంది, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని గ్రామాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. మిషన్ భగీరథ సరఫరా అయ్యే పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురికావడంతో కంది మండలంలో గత పది రోజులుగా మునుపెన్నడూ విధంగా నీటి కటకట ఏర్పడింది. మండల పరిధిలోని కొయ్యగుండుతాండా, చిమ్నాపూర్, కంది, కలివేముల, తోపుగొండ, మామిడిపల్లి, కవలంపేట, ఎర్దనూర్ తదితర గ్రామాల్లో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్నటువంటి కంది మండలంలో గత రెండు సంవత్సరాలుగా మిషన్ భగీరథ నీరు రావడంతో కాస్త ఊరట చెందారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాక జనాలు నానా తంటాలు పడుతున్నారు.

పంచాయతీ ట్యాంకర్ కోసం ఎదురుచూపులు

మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు నిత్యం ఇంటి ముందు బిందెలు, బకెట్లు, డ్రమ్ములు పెట్టుకున్న పంచాయతీ ట్యాంకరు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు పంచాయతీ బోర్లు కూడా పనిచేయడంతో నీటి సమస్య మరింత ఉధృతమైంది. ఎండా కాలం నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో ఎన్నిసార్లు మరమ్మతులు చేసిన పంచాయతీ బోర్లు పనిచేయకపోవడంతో ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రజల అవసరాలకు ట్యాంకర్ల నీరు సరిపోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ట్యాంకర్‌తో నీటిని సప్లై చేయాలంటే పంచాయతీ అధికారులు వారి జేబుకు చిల్లు పెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయం మిషన్ భగీరథ అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. గ్రామస్థులు కూడా ఈ ట్యాంకర్ల ద్వారా వచ్చే నీరు ఇంటి అవసరాలకే సరిపోక ఇబ్బందులు పడుతున్నామని, ఇక తమ పశువులు, మేకల, పెంపుడు జంతువుల గతి ఎంటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నీటి సమస్యను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



కందిలో పంచాయతీ ట్యాంకర్‌తో నీటిని సరఫరా

వెల్‌నెస్ సెంటర్‌లో గడువు ముగిసిన ట్యాబ్లెట్లు !

- జ్వరం, దగ్గుతో వెళ్లిన మహిళకు ఇచ్చిన ఫార్మసిస్ట్
- సంగారెడ్డి వెల్‌నెస్ సెంటర్‌లో ఘటన

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : మందులు ఇచ్చే ఫార్మసిస్టులు విధుల పట్ల ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా రోగులు ప్రాణాల మీద ఆశలు వదులుకోవాల్సిందే. తాజాగా సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్‌లో విధుల పట్ల ఫార్మసిస్ట్‌ల నిర్లక్ష్యం బహిర్గతమైంది. జ్వరం, దగ్గు ఇతరత్ర అనారోగ్య లక్షణాలతో ఆదివారం నాడు వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చిన ఓ ప్రభుత్వ ఉద్యోగి కుటుంబసభ్యురాలైన ఓ మహిళకు డాక్టర్ ఏడు రకాల మందులు రాశారు. ఓపీ చీటీతో ఫార్మసీకి వెళ్లిన ఆమెకు ఫార్మసిస్ట్ ఏడు మాత్రలు అందజేశారు. తదనంతరం ఆమె ఇంటికి వెళ్లిన తర్వాత ట్యాబ్లెట్లు ఒక్కోటి వేసుకుందామని పరిశీలిస్తుండగా అందులో ఓ ట్యాబ్లెట్(ఓమెప్రజోల్ గ్యాస్ట్రో క్యాప్సల్-20 ఎంజీ) గడువు ఫిబ్రవరి-2025 తోనే ముగిసినట్లు కనిపించింది. దీంతో వెంటనే పసిగట్టి అప్రమత్తమై ట్యాబ్లెట్‌ను వేసుకోకుండా ఆమె పక్కన బెట్టారు. ఈ విషయాన్ని ఆమె 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. గడువు ముగిసి రెండు నెలలు అవుతున్నా ఇంకా ఆ మాత్రలే ఇవ్వడంపై ఆ ఉద్యోగి, కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదరరాజనర్సింహ ఇలాకాలో ఇటు వంటి పరిస్థితి నెలకొనడం బాధాకరమని వారు వాపోయారు. కాగా రెండు నెలల నుంచి ఆ మాత్రలు ఇంకెంత మందికి పంపిణీ చేశారోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇదిలా ఉంటే 20 రోజులుగా ఈ వెల్‌నెస్ సెంటర్‌లో రెగ్యులర్ ఎంబీబీఎస్ డాక్టర్లు లేరు. డెంటల్ డాక్టర్ల తోనే ఓపీ మందులు రాసి పంపుతున్నారు. తాజాగా ఫార్మసిస్ట్ గడువు ముగిసిన మందులు ఇవ్వడం సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెల్‌నెస్ సెంటర్‌లో అడుగడుగునా జరుగుతున్న పరిణామాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు బాధితులు అభిప్రాయపడుతున్నారు.



సంగారెడ్డిలోని జడ్పీహెచ్ఎస్ కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యాసకులు

తొలి రోజే ఆరుగురు డిబార్

- డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ విధుల నుంచి తొలగింపు
- ప్రారంభమైన 'ఓపెన్' స్కూల్ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ థియరీ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పటాన్‌చెరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాన్ని రాష్ట్ర స్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసి కాపీయింగ్‌కు పాల్పడిన ఆరుగురు ఇంటర్ విద్యార్థులను డిబార్ చేశారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఓపెన్ టెన్త్ 9 కేంద్రాలు, ఇంటర్మీడియట్ 15 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఇంటర్మీడియట్ హింది, తెలుగు, ఉర్దూ పరీక్షకు 3257 మందికి 3023 మంది హాజరుకాగా, 234 మంది గైర్హాజరయ్యారు. టెన్త్ తెలుగు, తమిళ్, కన్నడ పరీక్షకు 1323 మందికి 1207 మంది హాజరుకాగా, 116 మంది గైర్హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరిగిన ఇంటర్మీడియట్ అరబిక్ పరీక్షకు 117 మందికి 105 మంది హాజరుకాగా 12 మంది గైర్హాజరయ్యారు. అదే విధంగా టెన్త్ సైకాలజీ, మరాఠి పరీక్షకు ఇద్దరికి ఇద్దరు హాజరయ్యారు. కాగా డీఈవో వెంకటేశ్వర్లు ఆర్‌సీపురం, బీహెచ్ఈఎల్‌లోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు.

అర్ధరాత్రి హైటెన్షన్

- సోషల్‌మీడియాలో ర్యాలీపై ఓ యువకుడి అనుచిత వ్యాఖ్యలు
- అతడి ఇంటివద్దకు వెళ్తున్న హిందూవాహిని యువకులను అడ్డుకున్న పోలీసులు
- మిరుదొడ్డిలో పికెటింగ్ ఏర్పాటు చేసిన పోలీసులు



గ్రామంలో మోహరించిన పోలీసులు

మిరుదొడ్డి, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం రాత్రి మిరుదొడ్డిలో నిర్వహిస్తున్న ర్యాలీ ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీసింది. హిందువుల ర్యాలీపై గ్రామానికి చెందిన ఓ వర్గానికి చెందిన యువకుడు సోషల్‌మీడియాలో హిందువులను రెచ్చగొట్టె వాఖ్యలను చేశాడు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా అర్ధరాత్రి ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఆ యువకుడి ఇంటి ముందు ధర్నా చేయడానికి వెళ్తున్న హిందూ వాహిని, బీజేపీ నాయకులను మిరుదొడ్డి పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, హిందేవాహిని కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీగా పోలీసులు మోహరించారు. ప్రధాన వీధుల్లో పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు. హిందువులపై అనుచిత వాఖ్యలను చేసిన సదరు యువకుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి చేరుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్ హిందూవాహిని కార్యకర్తలను శాంతింపచేశారు. దీంతో గ్రామంలో ఆందోళనను విరమించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చివరకు హిందువులపై అనుచిత వాఖ్యలను చేసిన యువకుడిపై చట్టపరమైన చర్యలను తీసుకుంటామని సీఐ హామినివ్వడంతో గొడవ సద్దుమనిగింది. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని కార్యకర్తలు మల్లేశం, శ్రీనివాస్, దేవరాజు, సహదేవారెడ్డి, కరుణాకర్, స్వామి, అంజిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జాతరకు సమాయత్తం

(5వ పేజీ తరువాయి)

తరలించాలని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు ఆదేశాలు అందాయి. సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, దూళిమిట్ట, మద్దూరు మండలాలు సభా ప్రాంతానికి 50 నుండి 70 కిలోమీటర్ల లోపే ఉంటాయి. ఇక్కడి నుంచి కూడా జనాన్ని సమీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లోనూ జనసమీకరణపై దృష్టి సారించారు.

వెయ్యిమందితో పాదయాత్ర

సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి వరకు 60 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు నిర్ణయించారు. వెయ్యి మందికిపైగానే విద్యార్థి, యువజన విభాగాల కార్యకర్తలతో జరగనున్న ఈ పాదయాత్రను ఈనెల 26న హరీశ్ ప్రారంభిస్తారు. మరుసటి రోజు సభాసమయానికి వీరంతా ఎల్కతుర్తికి చేరుకుంటారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే భారీ సభలకు సిద్దిపేటలో వినూత్నంగా కార్యక్రమాలు చేపడతారు. గతంలో సిద్దిపేట నుంచి వరంగల్ సభకు సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఇందులో కేసీఆర్, హరీశ్‌రావు సైతం ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో జరిగిన సభకు ట్రాక్టర్ల ర్యాలీ, అదే విధంగా ఓసారి ద్విచక్రవాహనాల ర్యాలీతో ఆకర్షించారు. ఈసారి వెయ్యిమందితో భారీ పాదయాత్రను అట్టహాసంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి భోజన, వసతి ఇతర సదుపాయాలను సిద్ధం చేశారు.

పునర్వైభవం కోసం

బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆ పార్టీకి గత ఎన్నికల్లో ఎదురుగాలి వీచింది. అసెంబ్లీ ఎన్నికల్లో 10 స్థానాలకు 7 చోట్లా గెలుపొందినప్పటికీ పార్లమెంటులో మాత్రం ఓటమి ఎదురైంది. మెదక్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాల్లో సిట్టింగ్‌లను కోల్పోయింది. అంతేగాకుండా మూడో స్థానానికి పడిపోయింది. ఈ అనూహ్య ఫలితాలతో మెతుకుసీమలోని సగటు గులాబీ కార్యకర్తలంతా తీవ్ర నైరాశ్యంలో మునిగారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చినప్పటికీ పార్టీ నుంచి అభ్యర్థిని నిలపలేదు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌కు గేర్ ఛేంజ్ చేసే అవకాశం దక్కలేదు. ప్రస్తుతం రజతోత్సవ వేడుక తెరమీదకు రావడంతో ఆ పార్టీలో ఉత్సాహం రేకెత్తుతోంది. గ్రామాలు, పట్టణాల్లో గోడ మీద రాతలు, వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలతో ప్రచారం చేస్తున్నారు. దారి ఖర్చులకు కూలి పనులు చేసి వినూత్నంగా నగదు సంపాదిస్తున్నారు. ఈ సభతోనైనా పూర్వ వైభవం చాటాలని భావిస్తున్నారు.

రోహింగ్యాలకు అడ్డాగా సంగారెడ్డి

- విశ్వహిందూపరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణం రోహింగ్యాలకు అడ్డాగా మారుతుందని విశ్వహిందూపరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ అన్నారు. సంగారెడ్డి పట్టణ శివారులోని శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డిలో హిందువులు సంఘటితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐక్యత లోపం, దౌర్జన్యంగా కూల్చివేసిన రామమందిర నిర్మాణానికి 11 తరాల స్వాభిమానాన్ని హిందువులు కోల్పోయారని తెలిపారు. బెంగాల్‌లో హిందూ మహిళల మాన, ప్రాణాలను తీస్తూ దాడులు చేస్తున్నారన్నారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహప్రముఖ్ సుభాష్‌చందర్ మాట్లాడుతూ శాంతినగర్‌లో ఓ ఇంటిని అక్రమంగా మసీదుగా మార్చారని ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అంతకుముందు వీహెచ్‌పీ జిల్లా ధర్మ ప్రసాద్ సమితి కార్యవర్గ ప్రశిక్షణ సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర ధర్మప్రసార్ ప్రముఖ్ జాదవ్, సంఘటన మంత్రి మల్లేశం, జిల్లా అధ్యక్షుడు పవన్ పాల్గొన్నారు.

వేతన వెతలు

- నాలుగు నెలలుగా అందని వేతనాలు ● పూట గడవక జీపీ కార్మికుల అవస్థలు

హత్నూర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అసలే చాలీచాలని వేతనాలు.. ఆపై ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. దిక్కుతోచని స్థితిలో విధులు నిర్వహిస్తూ.. నెలల కొలది కాలం వెళ్లదీస్తున్నారు పంచాయతీ కార్మికులు. హత్నూర మండలంలో 38 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో మొత్తం 160 మంది మల్టీ పర్పస్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వారం రోజుల క్రితం మండలంలోని 33 గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం వేతనాలు విడుదల చేసింది. మిగతా ఐదు గ్రామపంచాయతీలు గుండ్లమాచునూర్, బోర్పట్ల, గోవింద్రాజ్‌పల్లి, చందాపూర్, తుర్కలఖానాపూర్ గ్రామాలలో పని చేసే సుమారు 30మంది పంచాయతీ కార్మికులకు వేతనాలు విడుదల చేయకపోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉదయాన్నే నిద్ర లేచినప్పటి నుంచి గ్రామాంలోని వీధులను శుభ్రం చేయడంతో పాటు ప్రతి ఇంటికి తాగునీటిని అందించే గ్రామ పంచాయితీ కార్మికులకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.9,500 చెల్లిస్తుంది. ఆ డబ్బులతోనే ఇంటి అవసరాలు తీర్చుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. ప్రతీ నెల వేతనాలు వస్తాయన్న ఉద్దేశంతో ఇతరాత్ర అవసరాల కొరకు అప్పులు చేసుకున్నారు. 2024 నవంబరు నుంచి వేతనాలు రావడం లేదు. ఇతరాత్ర పనుల రూపకంగా నిధులు సమకూరి ఆర్థికంగా ఉన్న గ్రామ పంచాయితీ కార్యదర్శులు చెక్ రాసి ఎస్‌టీవోలకు పంపినప్పటికీ చెక్కులు డ్రా కావడం లేదు. ఫలితంగా కార్మికులకు నిర్ణీత సమయంలో వేతనాలు రాకపోవడంతో పూట గడవక అప్పుల పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధులున్నా ఎదురుచూపులు

మండలంలోని గుండ్లమాచూనూర్, బోర్పట్ల చందాపూర్, తుర్కలఖానాపూర్, గోవిందరాజుపల్లి గ్రామ పంచాయతీలలో ఇతరత్రా పన్నుల ద్వారా వచ్చిన కోట్ల రూపాయల నిధులు గ్రామ పంచాయతీల ఖాతాలో ఉన్నా ప్రభుత్వం వాటిని తీయకుండా ఫ్రీజింగ్ పెట్టడంతో నిరుపయోగంగా మారాయి. నిధులు లేని గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం సకాలంలో వేతనాలు చెల్లిస్తుండగా, తమపై వివక్ష చూపడం ఏమిటని ఆ ఐదు గ్రామ పంచాయతీల కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధుల విడుదలపై ఫ్రీజింగ్ ఎత్తివేసి బకాయి వేతనాలు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వేతనాల కోసం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు(ఫైల్)

జీతాలు ఇవ్వకుంటే బతికేదెట్లా?

తాము ప్రతీ రోజు గ్రామ పంచాయతీ పరిధిలో పనులు చేస్తున్నప్పటికీ నెలల కొలది వేతనాలు చెల్లించడం లేదు. నాలుగు నెలలుగా వేతనాలు రాక అప్పులు చేసి సంసారాన్ని నెట్టుకొస్తున్నాం.. పూటగడవని పరిస్థితిలో అనేక అవస్థలు పడుతున్నాం. అధికారులు కరుణ చూపి బకాయి వేతనాలు చెల్లించాలి.

\- శంకిరి దుర్గమ్మ, పంచాయతీ కార్మికురాలు, గుండ్లమాచునూర్

మండుటెండల్లో మల్లన్న భక్తుల ఇక్కట్లు

- రాజీవ్‌రహదారి పక్కన నిలువనీడ కరువు ● బస్సులకోసం ఎండలోనే పడిగాపులు

చేర్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు మండుటెండల్లో ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్ రహదారి పక్కన నిలువనీడ సౌకర్యం కల్పించకపోవడంతో నానా తంటాలు పడుతున్నారు. మల్లన్న ఆలయానికి రాజీవ్ రహదారి మీదుగా అయినాపూర్- తిమ్మారెడ్డిపల్లి శివారు, కొండపాక-కొమురవెల్లి శివారు మీదుగా దారి ఉంది. ఎక్కువశాతం కొండపాక స్వాగత తోరణం నుంచి భక్తుల రాకపోకలు సాగుతుంటాయి. సిద్దిపేట వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు నిలుపుతుండటంతో పాటు పక్కనే చిన్నపాటి షెల్టర్, దుకాణాలు ఉండటంతో భక్తులకు కాస్త నీడ లభిస్తుంది. కానీ సిద్దిపేట వైపనకు వెళ్లడానికి రోడ్డుకు అవతలి వైపున నిలబడుతున్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూలమలుపుతో పాటు వంపు నెలకొని ప్రమాదకర పరిస్థితి నెలకొన్నది. షెల్టర్ నిర్మాణం చేయాలని యేటా బ్రహ్మోత్సవ సమీక్షా సమావేశాల్లో ప్రస్తావించడం, సంబంధిత అధికారులు పరిశీలిస్తామంటున్నారే తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ఈవిషయమై ఆర్టీసీ, మల్లన్న ఆలయాధికారులు, పాలకమండలి, ప్రజాప్రతినిధులు చొరవ వహించి మల్లన్న భక్తులకు నిలువనీడ సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.



రాజీవ్ రహదారి పక్కన ఎండలో బస్సులకోసం ఎదురుచూస్తున్న భక్తులు

అకాల వర్షాలతో నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి

● మంత్రి పొన్నంకు ఫ్యాక్స్ ద్వారా వినతి

అక్కన్నపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన వారిని ప్రభుత్వం తరఫున ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఆదివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫ్యాక్స్ ద్వారా వినతి పత్రం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు, కూలిన ఇల్లు, పశువుల కొట్టాలకు నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యంను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

గజ్వేల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బెజుగామ గ్రామానికి చెందిన నక్కీర్త శ్రీనివాస్‌కు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు ఆదివారం గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఆయన వెంట నాయకులు శివారెడ్డి, మహ్మద్ సమీర్, జంగం రమేశ్‌గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, నక్క రేగొండ, నక్క రాములుగౌడ్, నేత నాగరాజు, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, అజ్గర్, సొక్కం సురేశ్, గణేశ్ తదితరులున్నారు.

ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

మిరుదొడ్డి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం పోచమ్మ ఆలయం రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

లద్నూరులో బొడ్రాయి వార్షికోత్సవం

మద్దూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నూరులో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవాలను గ్రామకమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మొదటి రోజు పూర్ణాహుతితో పాటు సాయంత్రం గ్రామ దేవతలకు, బొడ్రాయికి మహిళలు బోనాలను సమర్పించారు.

మాజీమంత్రి హరీశ్‌రావుకు బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక

గజ్వేల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోనిశ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న మోదీ

అక్కన్నపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకుండా కార్పొరేట్ బహుళ జాతి సంస్థలకు ప్రధాని మోదీ కొమ్ముకాస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ విమర్శించారు. ఆదివారం అక్కన్నపేట మండలం ధర్మారం, పోతారం(జే), నందారం గ్రామాల్లో నిర్వహించిన సీపీఐ గ్రామ సభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎడల వనేశ్, మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిద్దిపేట జేఏసీ కమిటీ ఎన్నిక

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మే 7వ తేదీ నుంచి తలపెట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మెకు కార్మికులను సమాయత్తం చేయడంలో భాగంగా సిద్దిపేట్ డిపోలో జేఏసీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర జేఏసీ కన్వీనర్ ఎండీ మౌలానా, రాష్ట్ర నాయకుడు ఎ.రవీందర్ తెలిపారు. ఆదివారం సిద్దిపేట ఆర్టీసీ జేఏసీ నూతన కమిటీని ప్రకటించారు. నూతన కమిటీలో చైర్మన్‌గా టీఎంయూ నుంచి ఎన్ మల్లేశం, వైస్ చైర్మన్‌గా ఈయూ నుంచి ఎన్ రాజయ్య, కన్వీనర్ గా బీఎంఎస్ నుంచి సీహెచ్.రాజయ్య, కో కన్వీనర్, కోశాధికారిగా ఎన్ఎంయూ నుంచి ఎండీ నూరుద్దీన్, గౌరవ సలహాదారులుగా బీఎస్ గౌడ్, కె.ఎం.రెడ్డి, ఎండీ మీనాజ్, బి.బాలకిషన్, జి.అశోక్, జి.ఎల్లయ్య, జి.బాలయ్య, ఎండీ అక్బర్, కె.శ్రీను, బి.సుజాత, కె.విమల ఉన్నారు.

రామకోటి రామరాజు కృషి అమోఘం

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ గ్రామాన రామభక్తిని నింపడం కోసం రామకోటి రామరాజు కృషి, పట్టుదల అమోఘం అని భద్రాచల దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శ్రీరామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ఆదివారం భద్రాచల సీతారాముల కల్యాణానికి ఈ సంవత్సరం 250 కిలోల గోటి తలంబ్రాలు ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు అందించారు.

దాచారంలో వివాహిత అదృశ్యం

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం గ్రామంలో ఆదివారం ఓ వివాహిత అదృశ్యమైంది. గ్రామానికి చెందిన పల్లెపు యాదగిరి మొదటి భార్య చనిపోవడంతో ఆరేళ్ల క్రితం కామారెడ్డి జిల్లాలోని ఇందల్‌వాయి గ్రామానికి చెందిన శ్రీలతను రెండోవివాహం చేసుకున్నాడు. వారికి రెండేళ్ల కుమార్తె ఉంది. దంపతుల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరిగేవి. ఆదివారం సాయంత్రం కంపెనీ నుంచి ఇంటికి వచ్చిన యాదగిరికి భార్య కనిపించ లేదు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నట్టు చెప్పిందని తల్లి తెలిపింది. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో భర్త గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

రింగురోడ్డు పనులకు మోక్షమెన్నడో?

- బందారం వద్ద అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు
- కంకర పోసి వదిలేయడంతో అవస్థలు పడుతున్న గ్రామస్థులు
- ఇలాగే ఉంటే వాహనదారులకు ఇక్కట్లే


బందారం గ్రామంలో కంకర పోసి వదిలేసిన రోడ్డు


పనులు పూర్తి చేయాలని కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్థులు(ఫైల్)

కొండపాక, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న రింగురోడ్డు పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో సౌకర్యం మాటేమో గాని లేని కష్టాలను తెచ్చిపెట్టింది. రింగురోడ్డు పనులకు మోక్షమెన్నడోనని ఆయా గ్రామాల ప్రజలు ఉసూరుమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట చుట్టూ పలు గ్రామాలను కలుపుతూ వేస్తున్న రింగ్ రోడ్డు నిర్మాణ పనులు కొండపాక మండలం బందారం గ్రామం వద్ద మధ్యలో నిలిచిపోయాయి. రోడ్డు పనుల్లో భాగంగా గ్రామంలో కంకర పోసి వదిలివేయడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సిద్దిపేట చుట్టూ నిర్మిస్తున్న రింగ్ రోడ్డు నంగునూరు మండలం పాలమాకుల, వెంకటాపూర్, తిమ్మాయిపల్లి నుంచి బందారం మీదుగా దుద్దెడను కలుపుతూ ఈ రోడ్డు పూర్తి చేయాల్సిఉంది. కానీ పనులన్నీ బందారం వద్ద నిలిచిపోవడం కొత్తసమస్యలను తెచ్చిపెట్టింది.

అర్ధాంతరంగా పనులు

దుద్దెడ రాజీవ్ రహదారి నుంచి బందారం వెళ్లే రోడ్డు వరకు విద్యుత్ స్తంభాలను తొలగించి పక్కకు వేసిన తర్వాత రోడ్డు వేయాల్సి ఉండగా అలా చేయకుండా ఒకపక్క రోడ్డును పూర్తి చేశారు మరోపక్క రోడ్డున అలాగే వదిలేశారు. దుద్దెడ నుంచి బందారం అంకిరెడ్డిపల్లి వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న బ్రిడ్జిని నిర్మించకుండా వదిలేశారు. దానివల్ల వర్షాకాలంలో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. వర్షాకాలానికి ముందే దాన్ని పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దుమ్ము, ధూళితో ఉక్కిరిబిక్కిరి

బందారం గ్రామంలో ప్రధాన వీధుల గుండా రోడ్డుపై కంకర పోసి వదిలేశారు. వాహనాల రాకపోకల కారణంగా లేచిన దుమ్ము ధూళితో స్థానికులు శ్వాసకోశ సమస్యలతో ఉక్కిరిబిక్కివుతున్నారు. మురికి కాలువలు నిర్మించకపోవడంతో మురికి నీరంతా రోడ్డుపై పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. బందారంలో రోడ్డు పనులను పూర్తి చేయాలని గత ఫిబ్రవరిలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రోడ్డు పనులను పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సేవచేయడంలోనే ఆత్మసంతృప్తి: ఎమ్మెల్యే పల్లా


కంటివైద్య శిబిరంలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తోటివారికి తోచినసేవచేయడంలోనే ఆత్మసంతృప్తి కలుగుతుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఫీనెక్స్ ఫౌండేషన్, శంకరకంటి ఆస్పత్రి సహకారంతో ఆదివారం కొమురవెల్లి మండలకేంద్రంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది 265మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. అందులో 85 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి హైదరాబాద్‌కు తరలించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల జీవితాలలో వెలుగులు నింపేందుకు బీఆర్ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరిపారన్నారు. సమాజంలో నిస్వార్థంతో సేవచేసినవారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొంగు రాజేందర్‌రెడ్డి మాజీ జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప, మాజీ ఉపసర్పంచు కొండా శ్రీధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా ఇటీవల చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని పలుగ్రామాలలో కురిసిన అకాల వర్షాలకు పంట, ఆస్తి నష్టం జరిగిన పలువురు బాధితులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు.

రూ.1.50లక్షల మేర పంటనష్టం పొందిన పెద్దరాజుపేట గ్రామానికి చెందిన రైతు అంకని సురేందర్‌ను ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. కొమురవెల్లి శివారులో రేకులషైకప్పు నేలకూలి గాయాలపాలైన జంగ పద్మ కుటుంబాన్ని పరామర్శించారు.

చర్చిలలో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు


చేర్యాలలోని షాలేము చర్చిలో ప్రార్థనలు జరుపుతున్న బ్రదర్ అందె విజయ్‌కుమార్

చేర్యాల/మద్దూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదిన వేడుకలను ఆదివారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల్లో క్రిస్టియన్లు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలలో క్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు క్రీస్తు శిలువ వేసిన తర్వాత మూడోరోజును ప్రజలు ఈస్టర్‌పండువగా జరుపుకుంటారు. మరణంపై యేసు క్రీస్తు గెలిచిన విజయోత్సవమే ఈస్టర్ పండుగని, ఆయన చూపిన మార్గం అనుసరనీయమని కొనియాడారు. అంతకు ముందు యేసు క్రీస్తు స్తుతిస్తూ గ్రామంలో రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘ పెద్దలు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


మద్దూరు: లద్నూరు చర్చిలో ప్రార్థనలు

విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుండాలి



జడ్పీ పాఠశాల వార్షికోత్సవంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో, ఉపాధ్యాయులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందుండాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కుకునూరుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షుడు కరీమొద్దీన్, పీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ నరేందర్ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డీఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఎం శ్రీకి ఎంపికైందని దీనికి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల ప్రతిభ కూడా తోడైందన్నారు. దీంతో పాఠశాలకు ఏటా రూ. 40లక్షల చొప్పున ఐదేళ్ల పాటు రూ.2కోట్ల నిధులు వస్తాయని, దీంతో పాఠశాలలో మౌలిక వసతులు, సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి ఉపయోగపడతాయని తెలిపారు.

కార్యక్రమంలో నవనీత, మల్లెం ఐలయ్య, కోల సద్గుణ రవీందర్, భూములుగౌడ్, అజీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్

అక్కన్నపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా జనం తరలి వచ్చి విజయవంతం చేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట, కోహెడ, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, సైదాపూర్, హుస్నాబాద్ మండలాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ మోస పూరిత హామీలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న పీపీ జీవన్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి : రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సిద్దిపేట జిల్లా ప్రధాన కోర్టుకు మొట్టమొదటి రెగ్యులర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాష్ట్ర ప్రభుత్వం తనకు అవకాశం కల్పించిందని అడ్వకేట్ జీవన్ రెడ్డి తెలిపారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా తన వంతుగా ప్రభుత్వానికి సహకారం అందిస్తానన్నారు. సిద్దిపేట జిల్లా కోర్టులో ఇప్పటివరకు చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిపై దృష్టి సారించి కేసులు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

హుస్నాబాద్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి


కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సైనిక్ స్కూల్‌ను వెనుకబడిన ప్రాంతమైన హుస్నాబాద్‌లోనే ఏర్పాటు చేయాలని ఆదివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు బీజేపీ నాయకులు వినతి పత్రం అందించారు. అలాగే నేషనల్ ట్రామా కేర్ సెంటర్‌ను కూడా హుస్నాబాద్ ప్రభుత్వ హాస్పటల్‌లో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కేంద్రమంత్రికి విన్నవించారు. బండి సంజయ్‌ను కలిసినవారిలో బీజేపీ పట్టణ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.

రాంసాగర్ రామాలయ వార్షికోత్సవాలు


ఆలయంలో మూలవిరాట్టు

రాయపోల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో శ్రీరామనవమి పండుగ తర్వాత పదిహేను రోజులకు రామాలయ వార్షికోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఈసారి కూడా వార్షికోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రామాలయంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, గణపతి, మండపారాధన, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 21న ఆవాహితా దేవతా పూజ, ఆవాహితా దేవతా హవనం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా 22న శ్రీరామ మూలమంత్ర హవనం, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు జరుగనున్నాయి. అనంతరం ఉదయం పదకొండున్నర గంటలకు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 23న ఉదయం సీతారాముల రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు భక్తబృందం సభ్యులు తెలిపారు.

రజతోత్సవ సభ కోసం.. కూలీలుగా మారిన బీఆర్ఎస్ కార్యకర్తలు


గట్ల మల్యాలలో కూలీ పని చేస్తున్న కార్యకర్తలు

నంగునూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు తరలి వెళ్లేందుకు ఆదివారం నంగునూరు మండలం గట్ల మల్యాలలో పార్టీ కార్యకర్తలు ఒక రోజు కూలి పని చేశారు. గ్రామానికి చెందిన బుద్ధి తిరుపతి, పుట్ట మధుకర్‌ల వ్యవసాయ క్షేత్రంలో పని చేసినందుకు రూ.10 వేల కూలీ చెల్లించారు. పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఎల్కతుర్తిలో చేపట్టే మహాసభకు వెళ్లేందుకు పార్టీపై భారం పడకుండా కూలీలుగా మారి నిధిని సమకూర్చుకున్నట్లు కార్యకర్తలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రేణుక వేణుగోపాల్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎర్రబాబు, వీర్యానాయక్, ప్రకాశ్‌రెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్, తిరుపతి, భిక్షపతి, వెంకటేశ్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదు


ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

ములుగు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం ములుగు మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామచంద్రారెడ్డి పదవీ విరమణ పొందారు. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ జహంగీర్, సిద్దిపేట జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు సలీం, ములుగు మండల ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎంఈవో మాధవరెడ్డి, రాయపోల్ ఎంఈవో సత్యనారాయణరెడ్డితో కలిసి రామచంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో 18 సంవత్సరాలుగా ములుగు గ్రామంలోనే ఉపాధ్యాయుడిగా చేరి అంకితభావంతో పని చేసి ప్రధానోపాధ్యాయుడు వరకు పదోన్నతి పొందారని కొనియాడారు. ఎంతో మంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన ఆయన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందువులపై దాడిని నిరసిస్తూ ప్రదర్శన


కొమురవెల్లిలో నిరసన ప్రదర్శన చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రతినిధులు

చేర్యాల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ కొమురవెల్లిలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈసందర్భంగా స్థానిక శివాజీ విగ్రహం నుంచి ఆలయ వీధులగుండా ర్యాలీ జరిపారు. అనంతరం భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ ఎక్కలదేవి శ్రీనివాస్ మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లో హిందువులపై వరుసదాడులు జరుపుతున్నా సీఎం మమతా బెనర్జీ పట్టించుకోకపోవడం తగదని పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ మండల కన్వీనర్ పాశం భరత్, ప్రకండ కన్వీనర్ బైరి రాజేందర్, హరీశ్, మధు, అచ్యుత్, అజయ్, మనోజ్, మహేశ్, బన్నీ, పవన్, రాజు, ముఖేశ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్' సవరణలపై బీఆర్ఎస్ వైఖరి బయటపెట్టాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 20: ముస్లింల మీద ప్రేమ, అభిమానం ఉంటే వక్ఫ్ చట్టంలో కేంద్ర మోదీ ప్రభుత్వం మార్పులు, చేర్పులు చేపట్టిన దానిపై బీఆర్ఎస్ వైఖరి బయటపెట్టాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ ముస్లింల అభివృద్ధి కోసం ఎప్పుడు పాటు పడలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మైనార్టీలందరూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైపే ఉన్నారని చెప్పారు. వక్ఫ్ బోర్డు చట్టాన్ని మార్చకుండా ఉండేందుకు మోదీ గద్దె దిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, సలీం, ఫయాజ్, అనిల్ పాల్గొన్నారు.

క్రాంతి స్కూల్ విద్యార్థుల ఎయిర్ పోర్టు సందర్శన


శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌ను సందర్శిస్తున్న క్రాంతి స్కూల్ విద్యార్థులు

సిద్దిపేట కలెక్టరేట్ ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): క్రాంతి హైస్కూల్ విద్యార్థులు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి నిర్వహించిన విజ్ఞాన పర్యటన వారికి అపూర్వమైన అనుభవాన్ని అందించింది. ఈ పర్యటనలో విద్యార్థులు విమానయాన రంగంలోని వివిధ కోణాలను నేరుగా తెలుసుకునే అవకాశం లభించింది. విమానాల నిర్మాణం, వాటి ఇంజినీరింగ్ వ్యవస్థలు, వాయు రవాణా నియంత్రణ వ్యవస్థలు, విమానాశ్రయ నిర్వహణ గురించి అవగాహన పొందారు. విమానాశ్రయ టెర్మినల్‌లో ప్రత్యక్ష పర్యవేక్షణ ద్వారా విమానయాన రంగంలోని రోజువారీ కార్యకలాపాలు, సవాళ్లను అర్థం చేసుకున్నారు. భవిష్యత్తులో విమానయాన రంగంలో కెరీర్ ఎంచుకోవడానికి ఈ పర్యటన స్ఫూర్తినిచ్చిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ అరుదైన అవకాశాన్ని కల్పించినందుకు విమానాశ్రయ అధికారులకు క్రాంతి హైస్కూల్ కరస్పాండెంట్ భగవాన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

కాల్వల కోసం ఒక్క ఎకరా కూడా భూ సేకరణ చేయలేదు


కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఏడాదిన్నర కాలం గడుస్తున్నా కాలువల నిర్మాణం కోసం ఒక్క ఎకరా కూడా భూ సేకరణ చేయలేదని మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని చౌడారం శివారులో రంగనాయకసాగర్ రిజర్వాయర్ ఎడమ కాలువ కింద ఉన్న ఎల్ఎస్ఎం-5 కాలువ ద్వారా గోదావరి జలాలు కమ్మర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొండెంగల కుంటలో కుమ్మరి కుంట, చెక్ డ్యామ్ నిండి మత్తడి దూకడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం చెక్ డ్యామ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు చెక్ డ్యాం వద్ద గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటల రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

అక్కన్నపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు దెబ్బతిన్న మామిడి తోటల రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ కోరారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన ఆకాల వర్షానికి దెబ్బతిన్న మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.